## బాటసారి

★

ప్రభాతమం దొక
పరాయి ఊరికి
పాంథుడం దొక్కడు
బయలుదేరినాడు.
కాలిబాటలో
కనపడె నతనికి
నయన పర్వముగ
నల్లని వస్తువు.
అబ్బురమ్ముగా
ఆనందముగా
ఆ ఆకారము
నారసి యిట్లనె.
పాం: "నేరెడు ఫలములు
నిగ నిగ లున్నవి.
ఇంద్రనీలమణి
ఇంపు లున్న యవి.
ఎట్టుల వచ్చితి
విక్కడ దనక?"
మ: "కాదు పాంథుడా! కలలు
గాంచకుము;
సామాన్యమ్మగు సామగ్రినె సుమి."
పాం: "నమ్మను నీ పలుకీమ్మాదిరి గా
కమ్మ కమ్మ గంధమ్మెక్కడిదని?
ఇంద్రలోకమున చంద్రాస్యలు గల
గదిలో అరలో కస్తురి ఉండదని?"
మ: "ఊరక కవివలె ఊహ లల్లకుము;
మనుజులు త్రొక్కే మట్టే వుండనే."
పాం: "కాదు కాదు నీ కథ ఘనమైనది
ఇంపు సువాసన లెక్కడివై తేని?"
మ: "నేను గులాబీ నీళ్ళ పాదులో
బడి నానిన యొక మట్టి పెళ్ళనే.
చెలిమి ఫలమ్ముగ విలువలు పెరిగే
పరిమళ మిచ్చె, బాటసారి కీ
పాటి హాయి ఇది బ్రదుకు వెళ్ళని!"

—రాచకుళ్ల ప్రసన్న సీతాకుమారి

# సంక్రాంతి

శ్రీమతి విద్యావతి

సంక్రాంతి వస్తోంది. ఈ యేడు అందరి కన్నా ముందు తనే సంది గొబ్బెమ్మ పెట్టాలనుకుంది సరోజ. అక్క నడిగింది "పెడదామా" అని. అలాగే నమ్మా "యివాళే సంది గొబ్బె పెడదాం" అన్నది శాంతి. సరోజ సంతోషంతో పెరట్లో కెళ్ళి ఆవు పేడ తీసుక రమ్మని పనిమనిషితో చెప్పి, పువ్వులు కోసుకు రావటానికి తోటలో కెళ్ళింది. శాంతికూ సంది గొబ్బెమ్మ పెట్టా లని సరదాగా ఉన్నది. తను పెద్దయ్యాకే సంది గొబ్బెమ్మను పెట్టటం మానేసింది. ఈ యేడైనా పెట్టించా లనుకున్నది.

శాంతి గొబ్బెమ్మను చేస్తున్నది. సరోజా పసుపు కుంకుమ పువ్వులు పట్టుకొచ్చింది. శాంతి బొట్టుపెట్టి, బంతి పువ్వులు, గుమ్మడి పువ్వులు పెట్టి గొబ్బెమ్మను అలంకరించి పీటమీద పెట్టింది. ఎదురుగా ఓ పీట వేసి పండ్లు, తాంబూలాలు, వడపప్పు వున్న పళ్ళెం వుంచింది. పిల్ల లందరూ కూచునేందుకు పక్కన చాపలు వేసింది. సరోజకు జడ వేసి, పువ్వులు పెట్టి పట్టు పరికిణీ చొక్కా తొడిగింది. కుంకుమభరిణ యిచ్చి పేరంటం పిలుచు రమ్మని పంపింది. సరోజ వెళ్ళి తన స్నేహితు రాండ్ల నందరినీ పిల్చుకొచ్చింది. అందరూ కూచున్నారు. "వూరికే కూచున్నా రేం, గొబ్బి తట్టండమ్మా!" అన్నది సరోజ అమ్మ. సరోజకు గొబ్బితట్టడం రాదు. "నాకు చేత కాదమ్మా!" అని దిక్కు మొహం వేసింది సరోజా. "సావిత్రీ! నీవు పెద్దపిల్లవు నీవు ముందు లేచి పాట మొదలెట్టు" అన్నది అమ్మ. "నాకు పాటలు రావండీ. శ్యామల బాగా పాడుతుంది" అన్నది సావిత్రి. "దొంగా. పాటలొచ్చేనా మూలకెళ్ళి కూచున్నావు. లేచిరా" అని శ్యామల చెయ్యి పుచ్చుకుని లాక్కొచ్చింది శాంతి. "నాకు జలుబు చేసిం దమ్మా! నేను పాడలేను" అని తప్పించుకున్నది శ్యామల. ఎంత బతిమాలినా యెవ్వరూ ముందుకు రాలేదు. సరోజకు విసుగ్గా వున్నది. "అమ్మా! అక్కను చెప్ప మనవే. మేమంతా పాడతాం" అన్నది సరోజా. అమ్మ శాంతకేసి చూసింది. "ఏం" అన్నట్టుగా. శాంత నవ్వుతూ లేచి నుంచుని, పమిట తిప్పి దోపుకుని పిల్లలందరినీ వరసగా నించోమన్నది. అందరికీ ముందు తను నుంచుని గొబ్బెమ్మ చుట్టూ తిరుగుతూ గొబ్బి తట్టుతున్నది. అందరూ అలాగే శాంతతో పాటు గుండ్రంగా తిరుగుతూ గొబ్బి తట్టుతున్నారు. శాంత పాట చెపుతున్నది. "గొబ్బి యళ్ళో సఖియా వినవే, చిన్ని కృష్ణుని సోదరి వినవే...." పిల్ల లందరూ శాంతతో కలిసి పాడుతున్నారు. పెద్ద ముత్తయిదు లంతా చూస్తూ కూచున్నారు.

గొబ్బి తట్టటం మయ్యాక అందరూ గొబ్బెమ్మ చుట్టూ కూచున్నారు. శాంతి గొబ్బెమ్మకు యెదురుగా కూచున్నది. సరోజ అక్క పక్కనే కూచున్నది. "గొబ్బెమ్మకు దణ్ణం పెట్టండి. వరాలు కోరుకుందాం. నేను చెప్పినట్టు మీరుకూడా అనండి" అన్నది శాంతి. అందరూ సంది గొబ్బెమ్మకు దణ్ణం పెట్టారు. శాంత చేతులు జోడించి గొబ్బెమ్మను ప్రార్థిస్తున్నది: "సంది గొబ్బెమ్మా! శుభము నివ్వాలే. తామర పువ్వంటి తమ్ముడి నివ్వాలే. చేమంతి పువ్వంటి చెల్లెల్ని వ్వాలే. మొగలి పువ్వంటి మొగుడి నివ్వాలే" సరోజకు చివరిమాట నచ్చలేదు. ఆ మాట

అరిశెం గా ప్రాయకున్నది. శాంతి రోజాకేసి చూసి, "ఏం రోజా నీకు మొగలిపువ్వు లాంటి మొగుడు వస్తాడా?" అన్నది. "పుహూ" అని అడ్డంగా తిప్పింది రోజా. "యేం మొగలి పువ్వు మంచి వాసన అందంగా వుంటుంది గా!" అన్నది శాంతి. "ఎందుకమ్మా అందం? దగ్గరికెళితే ముళ్ళు గుచ్చుకుంటాయి" అన్నది రోజా బుంగమూతి పెట్టి. మరెలాంటి వాడు కావాలే అన్నది అమ్మ. రోజా గొబ్బెమ్మ కెదురుగా బాసిపట్లు వేసి కూచుని భక్తితో చేతులెత్తి దణ్ణం పెట్టి, "మల్లె పువ్వంటి మొగుడిని నివ్వాలే సంబర గొబ్బెమ్మా" అని వేడుకున్నది. రోజాను చూసేసరికి శాంతికి నవ్వొచ్చింది. రోజా అరటిపండు నొలిచి గొబ్బెమ్మ ముందు పెట్టి నైవేద్యం పెట్టమన్నది. అమ్మ అరటిపండ్లు, వడపప్పు గొబ్బి తల్లికి నైవేద్యం పెట్టి అందరికీ పంచిపెట్టింది. అందరూ సరోజ దగ్గరికొచ్చి "మల్లెపువ్వు లాంటి మొగుడొస్తాడులే రోజా!" అని కవ్వించి వెళ్ళిపోయారు.

సరోజ అన్నం తిని పడుకుంది. నిద్ర పట్టలా. నిజంగా గొబ్బితల్లి తనకు మల్లెపువ్వు లాంటి మొగుణ్ణిస్తుందా?—అదే సందేహం. పక్కనే వున్న శాంతి నడిగింది: "అక్కా! సంబర గొబ్బెమ్మ నిజంగా మన కోర్కెలు తీరుస్తుందా?" అని. శాంతి తనలో నవ్వుకుని, "అవునమ్మా! తప్పకుండా తీరుస్తుంది" అని చెప్పింది. రోజా అదే ఆలోచనలో మునిగి పోయింది.

ఒక గంటయాక రోజా మల్లె పందిరి కింద కూచుని ఆ కాశంలో చంద్రుని కేసి చూస్తోంది. చంద్రునిలోంచి యేమిటో వస్తోంది. ముందు వచ్చేది గొబ్బెమ్మలా గుంది! అవును—గొబ్బెమ్మే! మెల్లగా దిగుతోంది. తనకేసే వస్తోంది. గొబ్బెమ్మా? కాదు మనిషే. గొబ్బెమ్మ అంతా మనిషిలాగే వున్నది. పెద్ద అంచు చీర. జరీ రవిక. మెళ్ళో నగలు అంతా మనిషిలాగానే వున్నది. ముఖం మాత్రం గుండ్రంగా గొబ్బెమ్మ లాగుంది. తల్లో బంతిపువ్వులు, గుమ్మడి పువ్వులు, కనకాంబరాలు ఎకరి కాల పూలు తను పెట్టిన సంబర గొబ్బెమ్మ లాగుంది. గొబ్బెమ్మ వచ్చి సరోజను ముందు నవ్వుతూ నిల్చున్నది. సరోజ లేచి గొబ్బెమ్మ పాదాలకు నమస్కారం చేసింది. గొబ్బెమ్మ రెండు చేతులతోనూ సరోజను లేవనెత్తి తల నిమురుతూ, "సరోజా! నీ మనసులో కోర్కె గ్రహించాను. నీ కోర్కె తీర్చటానికే వచ్చాను. ఇదుగో మల్లి రాజు" అంటూ వెనక వున్న వ్యక్తిని రోజాకు చూపెట్టింది. అతనే గుమ్మత్తు గొబ్బెమ్మలాగే అతనూ అంతా మనిషిలాగే వున్నాడు. పొడుగులాగు, చొక్కా, చేతికి వాచి పడవా కళ్ళ కళ్ళాడీలా గా వున్నాడు. ముఖం మాత్రం మల్లెపువ్వు లాగుంది. సరోజ ఆశ్చర్యంతో అతని కేసి చూస్తోంది. మల్లి రాజు చిరునవ్వుతో గొబ్బెమ్మ కేసి చూసి మళ్ళీ రోజా ముఖంలోకి చూస్తున్నాడు. రోజా సిగ్గుతో తలవంచుకున్నది. గొబ్బెమ్మ యిద్దర్నీ దగ్గరికి తీసుకుని ఒకరి చేతిలో ఒకరి చెయ్యి పెట్టించి, మల్లి రాజుకూ రోజా రాణికీ పాణిగ్రహణం చేసింది మల్లె పందిట్లో. పక్కనే వున్న కొలను దగ్గరికి తీసుకెళ్ళింది. నీళ్ళలో వాళ్ళ ముఖాలు చూసుకోమన్నది. యిద్దరూ చేతులు పట్టుకుని మెట్లు దిగి నీళ్ళలోకి దిగుతున్నారు. రోజాకు తన ముఖం చూసుకునేసరికి ఆశ్చర్య మేసింది. ముఖం రోజాపువ్వు లాగుంది. ఒక్కసారి ఒళ్ళంతా చూసుకున్నది యేమీ మారలేదు. తను కట్టుకున్న పట్టుపరికిణీ, చొక్కా, నగలు—అన్నీ అలాగే వున్నాయి. ముఖమే రోజాపువ్వులాగా వున్నది. రోజా కోపంతో గొబ్బెమ్మ కేసి చూసింది. గొబ్బెమ్మ మెల్లగా ఆ కాశంలో చంద్రునిలోకి వెళ్ళి పోతోంది. తనను చూసి నవ్వుతోంది. రోజాకు యింకా కోపమొచ్చింది. మల్లి రాజు నవ్వుతూ రోజా చెయ్యి పుచ్చుకుని "ఫరవాలేదు రోజా! కోప్పడకు. నీవలా గేవుంటే మా పువ్వుల రాజ్యంలోకి రానివ్వరు. అందుకనే నువ్వు రోజాపువ్వులాగా మారిపోయావు. ఇదంతా గొబ్బితల్లి చలవే. అని రోజాను పట్టుకుని తీసుకొచ్చి మల్లె పందిట్లో కూచోపెట్టి, "చూడు రోజా! గొబ్బెమ్మ వెళ్ళిపోతోంది. గొబ్బెమ్మకు మనం జేజేలు చెప్పుదామా!" అన్నాడు. "సరే" నన్నది రోజా. ఇద్దరూ లేచి నుంచుని, ఆ కాశంలోకి చూస్తూ. "జేజేలు జేజేలు. గొబ్బితల్లికి జేజేలు. సంబర గొబ్బికి జేజేలు. సంక్రాంతి లక్ష్మికి జేజేలు" అని సంబరగొబ్బెమ్మకు జేజేలు చెప్పారు. చూస్తూండగానే గొబ్బెమ్మ చంద్రునిలో మాయమై పోయింది. రోజా ఆనందంతో చప్పట్లు చరుస్తోంది.

"ఏమిటమ్మా, రోజా! చప్పట్లు కొడుతున్నావు? లే లే. అక్క ముగ్గు వేస్తోంది. త్వరగా వెళ్ళి ముఖం కడుక్కొని గొబ్బెమ్మలు పెట్టుకో త్వరగా" అంటూ దుప్పటి తీస్తోంది అమ్మ. రోజా గాభరాగా లేచి కూచుని కళ్ళు నలుపుకొంది. తన పక్కనున్నది మల్లి రాజు కాదే—అమ్మా! అయితే యిదంతా కలేనన్న మాట" అనుకుని లేచి మంచం దిగింది. "హరిలో రంగ హరి" అని పాడుతూ జియ్యరయ్య గుమ్మంలో చిందులు తొక్కుతున్నాడు. రోజా వెళ్ళి బియ్యం పట్టుకొచ్చి జియ్యరయ్యకు పెట్టి గొబ్బెమ్మలు పెట్టేందుకు పెరట్లో కెళ్ళిపోయింది. ★

## ఎక్కడికి

పన్నుల ఇనస్పెక్టరు, పన్నుల కలెక్టరు ఆఫీసులు రెండూ ఒకే భవనంలో వున్నాయి. ఒక స్త్రీ లిఫ్టు యెక్కి లిఫ్టు నడిపేవానితో 'పన్నులు' అంది.

'కలెక్టరా? ఇనస్పెక్టరా?' అని అడిగాడు నడిపేవాడు.

'పన్నులకయ్యా నాయనా మిగతావి నాకు తెలుసు' అందామె.

'ఇలా చూడండమ్మా. ఇంతకీ మీరు డబ్బు కట్టడానికి వచ్చారా లేక పూరికే వాదం కోసం వచ్చారా? చెబితే ఎక్కడికి అయిందీ చెబుతాను' అని అడిగాడు నడిపేవాడు.